సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



మలి విడత పోరుకు రెడీ

స్కూల్‌గేమ్స్ మలివిడత పోరుకు అంతా సిద్ధమైంది. ఎంపిక పోటీలు జరగనున్నాయి.

-8లో



నేడు విస్తృతస్థాయి సమావేశం

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం నేడు జరగనుంది. పెద్దిపాలెం వేదిక కానుంది.

-8లో

ముంపు గ్రామాల్లో వైద్య శిబిరాలు

కొత్తూరు: వంశధార వరదలకు ప్రభావితమైన పెనుగోవాడ, మాతల, నివగాం, పొనుటూరులతో పాటు పలు గ్రామాల్లో శనివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ శిబిరాలను ఏర్పాటు చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాలను తహసీల్దార్ కె. బాలకృష్ణ పరిశీలించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లావాసులకు చోటు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాకు చెందిన నలుగురికి అవకాశం కల్పిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్రపార్టీ కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా టెక్కలి నియోజకవర్గానికి చెందిన దివ్వాల పొలయ్య, ఆర్టీఐ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా ఆమదాలవలస నియోజకవర్గం నుంచి బద్రి రామారావు, ఆర్టీఐ వింగ్ రాష్ట్ర సంయుక్తకార్యదర్శులుగా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి మీసాల వెంకటరమణ, టెక్కలి నియోజకవర్గం నుంచి అక్కురాడ లోకనాథంలను నియమించారు.

'కార్మిక హక్కులు కాలరాస్తున్నారు'



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

సోంపేట: కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. సోంపేట పట్టణంలో సీఐటీయూ జిల్లా మహాసభలు శనివారం ప్రారంభించారు. సీనియర్ నాయకులు కె.సూరయ్య సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరులైన ఉద్యమ నాయకులు సీతారాం ఏచూరి, వీజీకే మూర్తి, కొల్లి సత్యనారాయణ, ఎంవీ సత్యనారాయణ దొరల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 8 గంటల పనివేళలను 13 గంటలు చేస్తూ తీసుకువచ్చిన నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తే నిరసనలు తప్పవన్నారు. ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వాలు ఎకరా 99 పైసలు చొప్పున ధారాదత్తం చేయడం దారుణమన్నారు. శని, ఆదివారాలు రెండు రోజులు మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. మహాసభల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కేఎస్‌వీ కుమార్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు, ఉపాధ్యక్షుడు నాగమణి, కార్యదర్శులు సంగారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పరిశీలన



హిరమండలం తుంగతంపర వద్ద కోతకు గురైన గట్టును పరిశీలిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

హిరమండలం: మండలంలో వంశధార వరదకు నీట మునిగిన పొలాలను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శనివారం పరిశీలించారు. మండలంలోని జిల్లేడిపేటలో నీట మునిగిన పంటపొలాలు, తుంగతంపర గ్రామ సమీపంలో కోతకు గురైన కరకట్టను ఆయన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలసి పరిశీలించారు. నష్టంపై నివేదికలు వచ్చాక పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

జూనియర్ వరల్డ్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా సూరిబాబు



ఎస్.సూరిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు అంపైర్‌గా జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు నియామకమయ్యారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ సంజయ్ మిశ్రా నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. 97 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్న ఈ మెగా టోర్నమెంట్ పోటీలకు భారతదేశమే ఆతిథ్యం ఇవ్వనుంది. అస్సాం రాష్ట్రంలోని గౌహతి వేదికగా ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఈ జూనియర్ వరల్డ్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా సూరిబాబు వ్యవహరించనున్నారు. ఈయన చిలకపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీగా పనిచేస్తూ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీఈఓగా, పీఈటీ సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈయన నియామకంపై బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఆర్.రాజేంద్రన్, అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.సాగర్, ఎం.అశోక్‌కుమార్, చిలకపాలెం స్కూల్ హెచ్ఎం చౌదరి లీలావతికుమారి, డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, ప్రసాద్, అనిల్, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, పి.తవిటయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అవినీతి వరద



నాడు

ఆమదాలవలస నియోజకవర్గం పురుషోత్తపురం వద్ద వంశధార నదిలో టీడీపీ అధికారంలో ఉండగా 2018జూలై 15న రాత్రి పూట ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉండగా ఆకస్మికంగా వరద నీరు వచ్చింది. దీంతో 20లారీల, జేసీబీలు నదిలో మునిగిపోయాయి. ఆ సమయంలో లోడింగ్ చేసేందుకు వెళ్లిన కూలీలు, డ్రైవర్లు, క్లీనర్లు దాదాపు 55మంది వరదనీటిలో చిక్కుకుపోయారు. లారీలు ఎక్కి కేబిన్‌లో తలదాచుకున్నారు. ఈ లోపు జిల్లా యంత్రాంగం సమాచారం అందుకుని ఎన్డీఆర్ టీమ్‌లు వెళ్లి వారందరినీ రక్షించాయి. ఆమదాలవలస టీడీపీ కీలక ప్రజాప్రతినిధికి చెందిన లారీలుగా వాదనలు వినిపించాయి. ఈ ఘటన జిల్లాల్లోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

- 2018 సీన్ రిపీట్
- వరద సాక్షిగా పచ్చనేతల దోపిడీ బట్టబయలు
- నాడు నదిలో చిక్కుకున్న లారీలు... నేడు జేసీబీలు
- పురుషోత్తపురం వద్ద నదిలో చిక్కుకున్న ఇసుక తవ్వకాల జేసీబీ
- నది పక్కన మరికొన్ని జేసీబీలు
- అనుమతుల్లేకుండా యంత్రాలతో తవ్వకాలు
- టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ ఇదే తంతు



నేడు

అదే ఆమదాలవలస నియోజకవర్గం పురుషోత్తపురం వద్దే మళ్లీ అదే సీన్ తాజాగా రిపీట్ అయింది. నదిలో ఇసుక అక్రమంగా తవ్వుతున్న జేసీబీతో పాటు అనధికారికంగా వేసిన ఇసుక దిబ్బలను వంశధార వరదనీరు ముంచెత్తింది. మరికొన్ని జేసీబీలు కూడా నదిలోకి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా భారీగా వరదనీరు వస్తుండటంతో వెనక్కి తగ్గి, రోడ్డుపైనే ఉంచేసి నిర్వాహకులు ఉడాయించారు. ఇవి కూడా టీడీపీ కీలక ప్రజాప్రతినిధి అనుచరులవే అన్న వాదనలు ఉన్నాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వరద సాక్షిగా టీడీపీ నాయకుల అక్రమాలు బయటపడ్డాయి. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి అక్రమ డబ్బు కోసం ఇసుక దోపిడీ చేయడమే కాదు కూలీల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం టీడీపీ నేతలకు బంగారు గనిగా మారిపోయింది. అధికారంలోకి వస్తే చాలు కనీసం రూ.10 కోట్ల నుంచి రూ.15కోట్లు అక్కడే అక్రమంగా సంపాదిస్తున్నారు. పురుషోత్తపురం ర్యాంపు వద్ద ఇసుక కోసం వందల సంఖ్యలో లారీలు బారులు తీరిన సందర్భాలు ఉన్నాయి. భారీగా వర్షాలు పడుతున్నాయి. ఎగువ ప్రాంతమైన ఒడిశాలోనూ వర్షాలు కురుస్తున్నాయి. వంశధారకు వరద పోటు ఉంటుందని హెచ్చరికలు ఉన్నాయి. అయినప్పటికీ ఇసుక కోసం అక్రమంగా నదిలోకి యంత్రాలను దించి, తవ్వకాలు చేపడుతున్నారంటే ఇసుక మాఫియా ఎంత బరితెగించిందో అర్థం చేసుకోవచ్చు. పోతే ప్రాణాలు.. వస్తే డబ్బులు అనే ధోరణిలో ఇసుక నిర్వాహకులు ఉన్నారు. అసలే వర్షాల సీజన్.. ఆపైన వరదలు.. ఎక్కడా ర్యాంపులకు అనుమతి లేదు. అయినప్పటికీ ఇక్కడ నదిలోకి పదుల సంఖ్యలో జేసీబీలు పెట్టి ఇసుక తవ్వకాలు చేపట్టి, రోజుకి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు.

అనుమతులతో మాకు పనేంటి..!

నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదులు టీడీపీ అధికారంలో ఉన్న 2104–19లో బక్కచిక్కిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి గుల్లగా మారిపోయాయి. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ఏ ఒక్కదాన్ని విడిచిపెట్టలేదు. నిరాటకంగా ఇసుక దోపిడీ సాగించారు. జిల్లా సాండ్ కమిటీ పర్యావరణ అనుమతులున్న రీచ్‌ల నుంచే ఇసుకను తవ్వాల్సి ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులతో సంబంధం లేకుండా,పర్యావరణ చట్టాలకు, తూట్లు పొడుస్తూ ఇసుక మాఫియా నాడు చెలరేగిపోయింది. సాయంత్రం 6 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో ఇసుక తవ్వకాలు జరపకూడదని నిబంధనలు ఉన్నా అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకూ ర్యాంపుల్లో జేసీబీలు, పొక్లెయినర్లతో తవ్వకాలు జరిపిన దృశ్యాలను ఆ ప్రాంత గ్రామస్తులంతా కళ్లారా చూశారు. లారీలను నేరుగా నదుల్లోకి తీసుకెళ్లి మరీ ఇసుకను నింపేశారు. వంతెనలకు, ఇరిగేషన్ పంపులు, వాటర్ ఫిల్టర్ సంపులకు 500 మీటర్లు దూరంలో ఇసుక తవ్వకాలను చేపట్టాలి. కానీ నిబంధనలు ఎక్కడా పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా అదే చేస్తున్నారు. వాల్టా చట్టాలను ఉల్లంఘించి ఇసుక దోచేస్తున్నారు. ప్రస్తుతం తీర గ్రామాలన్నీ వణికిపోతున్నాయి. నాగావళి, వంశధార నదుల వరద పోటుతో ముంచెత్తుతాయేమోనన్న భయంలో కొట్టుమిట్టాడుతున్నాయి.



వరద వస్తుండటంతో నది పక్కనే జేసీబీలు ఉంచేసి వెళ్లిపోయిన నిర్వాహకులు

కూటమి వైఫల్యాలు ప్రజలకు చెబుదాం

- 15వ తేదీ సమావేశానికి తరలిరావాలి
- పటిష్ట కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

కూటమి వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లాలని, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలను పాటిస్తూ పార్టీ నియమనిబంధనలకు కట్టుబడి మనమంతా కలసికట్టుగా అడుగులు ముందుకేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ సమన్వయకర్తలు, పార్లమెంటరీ పరిశీలకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ కోఆర్డినేటర్లు, నియోజకవర్గ సమన్వయకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో దాదాపుగా అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం పూర్తయ్యిందని, మిగిలిన టీమ్‌లను నియమించేందుకు యాక్టివ్‌గా పనిచేసే వారికి అవకాశం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వంపై జనాల్లో వ్యతిరేకత ఉందని, దాన్ని ఇంకా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పనిచేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టి 5 పూర్తి చేసి తరగతులు ప్రారంభించి సేవలందిస్తే.. వాటిని సైతం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి సొమ్ము పోగు చేసుకోవాలని చూస్తున్నారన్నారు. పీపీపీ పద్ధతిలో ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టేందుకు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.

ఈ సందర్భంగా పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ గ్రామం నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు అన్ని రకాల అనుబంధ విభాగాలు పూర్తిచేయాలని, ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. 5 పంచాయతీలకు ఒక్క అబ్జర్వర్ ఉండాలన్నారు. ఈ నెల 20వ తేదిలోపు గ్రామస్థాయి కమిటీలు పూర్తయిపోయేలా చూడాలన్నారు. అన్ని విభాగాల్లో 10 శాతం మహిళలు ఉండేందుకు ప్రయత్నం చేయాలన్నారు. మాజీ మంత్రి, పార్టీ డాక్టర్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఏ ఒక్కరినీ విస్మరించే పరిస్థితి ఉండదని, సైనికుల్లా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, పిరియా సాయిరాజ్, పార్టీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శులు దుంపల రామారావు, కరిమి రాజేశ్వరరావు, సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్ గొండు కృష్ణమూర్తి, చల్ల శ్రీనివాసరావు, వలంటీర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు గంట్యాడ రమేష్, జిల్లా ప్రధానకార్యదర్శి గేదెల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆక్రందన

- దేవాది వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ
- నుజ్జయిపోయిన క్యాబిన్‌లో చిక్కుకుపోయిన డ్రైవర్
- గంట పాటు శ్రమించి బయటకు తీసిన స్థానికులు



కేబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

నరసన్నపేట: జాతీయ రహదారిపై దేవాది వద్ద లారీ డ్రైవర్ బబుల్ సింగ్ శుక్రవారం అర్ధరాత్రి చేసిన ఆక్రందనలు స్థానికులకు కలిచి వేశాయి. జాతీయ రహదారిపై నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వెళ్తున్న మార్గంలో దేవాది ముందు ఒక టీ స్టాల్ వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక ఉన్న లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జయిపోయింది. డ్రైవర్ బబుల్ సింగ్ ఆ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. అర్ధరాత్రి పూట ఆయన పడిన బాధ వర్ణనాతీతం. అటుగా వెళ్తున్న వారు వాహనాలు ఆపి ఎంతగా ప్రయత్నించినా ఆయనను బయటకు తీయలేకపోయారు. చివరికి హైడ్రా వాహనం సహాయంతో స్థానికులు కేబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీశారు. అప్పటికే డ్రైవర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎస్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో సిబ్బంది ప్రథమ చికిత్స చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఆ గంట కాలం డ్రైవర్ పడిన నరక యాతన చూడలేకపోయామని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది. కాగా దేవాది –కోమర్తిల మధ్య జాతీయ రహదారిపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.

శివాలయంలో నాగుపాము

టెక్కలి రూరల్: స్థానిక జగతిమెట్ట కొండపై గల శివాలయానికి ఓ సర్పం వచ్చి వెళ్తోందని అర్చకుడు శివ తెలిపారు. వారం రోజుల కిందట పాము లింగాన్ని చుట్టి ఉండగా ఫొటో తీశామని, శనివారం మధ్యాహ్నం కూడా ఇదే పాము మళ్లీ వస్తే వీడియో తీశామని చెబుతున్నారు.



శివలింగానికి చుట్టుకుని ఉన్నట్లుగా వైరల్ అయిన నాగుపాము ఫొటో



శనివారం శివలింగం వద్ద ఉన్న నాగుపాము

శాంతించిన వంశధార

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 1,04,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి నుంచి ప్రవాహం తగ్గింది. శనివారం ఉదయం 6 గంటలకు 50380 క్యూసెక్కులకు చేరింది. సాయంత్రం 5 గంటలకు 40047 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గింది. బ్యారేజీ వద్ద గరిష్ట నీటిమట్టం 38.10 మీటర్లు కాగా ప్రస్తుతం 34.83 మీటర్ల వరకు నీరు ఉంది.



దిగువకు విడిచిపెడుతున్న నీరు

ముంపు ప్రాంతాల పరిశీలన


ఇచ్ఛాపురం రూరల్: వరద ముంపు ప్రాంతాలను జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ శనివారం పరిశీలించారు. శనివారం ఆమె మండలం తులసిగాం, ఇన్నేశుపేట గ్రామాల్లో పర్యటించి ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు బాహుదా నదిలో వరద నీరు చేరడంతో పద్మపురం గెడ్డ ఉప్పొంగి సుమారు 300 ఎకరాలకు పైగా పంట పొలాలు వరద నీటి ముంపునకు గురయ్యాయని అన్నారు. ప్రభుత్వం ఎరువుల పంపిణీలో విఫలం కావడంతో రైతులు ఒడిశాలో అధిక మొత్తాన్ని వెచ్చించి కొనుగోలు చేశారని, ఇప్పుడు మళ్లీ ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ముంపు ప్రాంతంలో పర్యటించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎరువులు అందజేయాలని కోరారు. ఎంపీపీ బోర పుష్ప, వైస్ ఎంపీపీ దువ్వ వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ ఇసురు తులసీరామ్, ఇసురు యాదవరెడ్డి, వలసయ్య, ఇసురు పరశురాం తదితరులు ఉన్నారు.



తులసిగాం పంట పొలాల్లో పర్యటిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

విలయానికి సాక్షి

వరద తెచ్చిన విలయానికి సాక్షిగా పొలం ఇలా కన్నీరు పెడుతోంది. హిరమండలం మండలంలోని గులుమూరు, జిల్లేడుపేట తదితర గ్రామాల్లో 400 ఎకరాల వరకు పంట ఇలా నీట మునిగింది.
– హిరమండలం



హిరమండలం: గులుమూరు వద్ద నీట మునిగిన పంట పొలాలు

దహన కాండ



పది తలలు.. 55 అడుగుల పొడవు.. 47 అడుగుల వెడల్పు.. అంతటి దశకంఠుడి విగ్రహం శ్రీరామ నామస్మరణ సాక్షిగా కాలి బూడిదైంది. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రావణ దహనం నిర్వహించారు. దాదాపు అరగంట పాటు బాణసంచా వెలుగుల్లో మైదానం దేదీప్యమానంగా వెలిగింది. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీఓ, తదితర అధికారులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.
– శ్రీకాకుళం కల్చరల్





క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ఎచ్చెర్ల : పొన్నాడ బ్రిడ్జి రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ముద్దాడ నవీన్ (19) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమదాలవలస మండలం కలివరం పంచాయతీ ముద్దాడపేటకు చెందిన నవీన్ గతేడాది పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి ప్రస్తుతం విశాఖపట్నంలో ఉంటున్నాడు. పార్ట్‌టైం జాబ్ చేసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. దసరా సెలవుల కోసం ఇంటికి వచ్చి స్నేహితుడి బైక్ తీసుకుని ఎచ్చెర్ల మండలం పొన్నాడ వైపు వచ్చాడు. రాత్రి 12 గంటల సమయంలో పొన్నాడ నుంచి శ్రీకాకుళంవైపు వస్తుండగా అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

చెరువులో మునిగి యువకుడు మృతి


దామోదరరావు(ఫైల్)

నరసన్నపేట: కామేశ్వరిపేటలో శనివారం విషాదం అలుముకుంది. ఉదయం స్నానానికి దిగిన కనుగుల దామోదర రావు(37) అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. వర్షాలకు గుమ్మన చెరువులో నీరు బాగా చేరింది. ఎప్పట్లాగే స్నానానికి దిగిన దామోదరరావు లోపలికి వెళ్లి పోయాడు. ఒక్కసారి మునిగిపోవడం, ఈత రాకపోవడంతో చేతులు పైకెత్తి కేకలు వేశాడు. దూరంగా ఉన్న వారు గమనించి చెరువులో దిగి ఆయన్ను బయటకు తీశారు. అప్పటికే చనిపోయినట్లు గ్రామస్తులు గుర్తించారు. ఈ ఘటనపై తల్లి రామమ్మ నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దామోదరరావుకు వివాహం కాలేదు. తల్లి వద్దనే ఉంటున్నాడు. తండ్రి గతంలోనే మృతి చెందారు. ఒక్కగానొక్క మృతి చెందడంతో తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. దామోదరరావు మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు వాకముళ్ల చక్రధర్, కోట జోగినాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి


మృతి చెందిన ప్రసాదరావు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. శ్రీకాకుళం పట్టణంలో కంపోస్టు కాలనీకి చెందిన బరాటం ప్రసాదరావు (68) రణస్థలం మండలంలోని కోష్టలో పాన్‌షాప్ నడుపుతూ అక్కడే నివాసముంటున్న కుమారుడు శ్రీనివాసరావు వద్దకు బయలుదేరాడు. శనివారం ఉదయం రణస్థలంలో దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు స్పందించి 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సోషల్ మీడియాలో ఫొటో చూసి కుమారుడు, బంధువులు గుర్తుపట్టి రిమ్స్‌కు చేరుకున్నారు. కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్: ఇప్పిలి గ్రామానికి చెందిన ఇప్పిలి ఈశ్వరరావు (48) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల సత్యనారాయణ ప్రవర్తనలో తేడా రావడంతో కుమార్తె, కుమారుడు నిలదీశారు. కోపోద్రుక్తుడైనా ఈశ్వరరావు పంట పొలాలకు కొట్టే పురుగుల మందును శుక్రవారం తాగాడు. తాను చనిపోతున్నానంటూ స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే శ్రీకాకుళం నగరంలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతదేహన్ని రిమ్స్‌కు తరలించారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు టెక్కలి ఎస్ఐ రాము తెలిపారు. బీహార్‌కు చెందిన ఎండీ స్వామన్ 640 గ్రాముల గంజాయి తీసుకుని ట్రైన్‌లో టెక్కలి వచ్చి అక్కడి నుంచి బస్సులో హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హిజ్రాల దారిదోపిడీ

నరసన్నపేట: ఉర్లాం–నడగాం మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం కొందరు హిజ్రాలు కారులో వచ్చి దారిదోపిడీకి పాల్పడ్డారు. నడగాంకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ దొంపాక ఆనంద రమణ మెడలో బంగారు చైన్‌ను లాక్కొని ఉడాయించారు. ఉర్లాం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నడగాం రైల్వేగేటు దాటిన తర్వాత రోడ్డుపై కాచి ఉన్న ఐదుగురు హిజ్రాలు వాహనాన్ని ఆపి డబ్బులు అడిగారని ఆనంద రమణ తెలిపారు. ఇవ్వకపోవడంతో మెడలో తులంన్నర బంగారు చైన్ లాక్కొళ్లిపోయారని, ఈ మేరకు నరసన్నపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

స్కూల్‌గేమ్స్..

మలివిడత పోరుకు రెడీ


కబడ్డీ సాధనలో క్రీడాకారులు

- నేటి నుంచి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు
- ఐదు రోజుల పాటు వివిధ విభాగాల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మలివిడత స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు రంగం సిద్ధమైంది. జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వివిద క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, ఉషూ, బాక్సింగ్ నాలుగు క్రీడాంశాల్లో ఎంపికలు ముగియగా.. మిగిలిన క్రీడాంశాలకు ఎంపిక పోటీలను పాఠశాలలకు ముందస్తు దసరా సెలవును ప్రకటించడంతో వాయిదాపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగిలిన జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటిలో కొన్ని మినహా మెజారిటీ సెలక్షన్స్ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోనే జరగనున్నాయి. ఐదు రోజులపాటు నిర్దేశిత షెడ్యూల్‌ను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ ఎ.రవిబాబు, కార్యదర్శి బీవీ రమణ సంయుక్తంగా వెల్లడించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పీడీ–పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.తవిటయ్య, మొజ్జాడ వెంకటరమణ పిలుపునిచ్చారు.


వాలీబాల్ సాధనలో..

ఐదు రోజుల షెడ్యూల్ ఇది..

తొలిరోజు 5న: హాకీ (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్), వెయిట్‌లిఫ్టింగ్ (పెద్దపాడు), రెజ్లింగ్ (పెద్దపాడు), ఆర్చరీ (రాజ్‌కుమార్ అకాడమీ శ్రీకాకుళం), రగ్బీ, నెట్‌బాల్, రోప్ స్కిప్పింగ్, షూటింగ్‌బాల్ (టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం), టేబుల్‌టెన్నిస్ (శాంతినగర్‌కాలనీలో డీఎస్ఏ ఇండోర్ స్టేడియం), యోగా (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సత్యవరం, నరసన్నపేట మండలం), లాన్‌టెన్నిస్ (శ్రీకాకుళం ఆర్ట్స్‌కాలేజ్ టెన్నీస్ అకాడమీ). కరాటే (శ్రీకాకుళం మహాలక్ష్మినగర్‌కాలనీలోని శ్రీచైతన్య స్కూల్).

6న: అథ్లెటిక్స్ (కోడిరామ్మూర్తి స్టేడియం శ్రీకాకుళం), త్రోబాల్ (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్), అండర్–14, 17 చెస్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎచ్చెర్ల).

7న: కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్ బాలురుకు మాత్రమే (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానం), క్రికెట్ (ఆర్ట్స్‌కాలేజ్), బాల్‌బాడ్మింటన్ (ఆర్ట్స్‌కాలేజ్), అండర్–19 చెస్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎచ్చెర్ల).

8న: కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ బాలికలకు మాత్రమే (శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానం), స్విమ్మింగ్ (శాంతినగర్‌కాలనీలో డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్), తైక్వాండో, ఫెన్సింగ్ (శ్రీకాకుళం టౌన్ హాల్), బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర (ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం శ్రీకాకుళం), బేస్‌బాల్ (కేఆర్ స్టేడియం శ్రీకాకుళం)

9న: హ్యాండ్‌బాల్ (జెడ్పీహెచ్ స్కూల్ తొగరాం, ఆమదాలవలస మండలం).

షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలి..



జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు సంబంధించి మలివిడత షెడ్యూల్‌ను ప్రకటించాం. అండర్–14,17,19 విభాగాల్లో బాలబాలికలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన మైదానంలో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలి. అవసరమైన ధ్రువపత్రాలు తీసుకురావాలి.

– బిడి వెంకటరమణ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ

సద్వినియోగం చేసుకోవాలి..



స్కూల్‌గేమ్స్ అనేవి విద్యార్థులకు వరమనే చెప్పాలి. క్రీడాకారులు గుర్తింపు పొందేది, తయార్యేది స్కూల్‌గేమ్స్ నుంచే. ఎంపికల్లో ప్రతిభ కనబర్చి జిల్లా జట్లకు ఎంపికయితే రాష్ట్రపోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. బాలబాలికలంతా సద్వినియోగం చేసుకోవాలి.

– మొజ్జాడ వెంకటరమణ, జిల్లా పీడీ–పీఈటీ సంఘ ప్రధాన కార్యదర్శి

అమలపాడులో ఘటాల ఉత్సవం



దుర్గమ్మా..చల్లగా చూడమ్మా..


ఆకట్టుకున్న కాళీమాత వేషధారణ

అమలపాడు గ్రామం భక్త జనసంద్రమైంది. దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన దుర్గమ్మతల్లి ఘటాల ఉత్సవానికి అశేష జనవాహిన తరలి రావడంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. పాహిమాం దేవీ.. పాహిమాం.. అంటూ భక్తుల శరణు ఘోషతో సాగిన ఘటాల ఊరేగింపులో మేళతాళాలు, పగటి వేషాలు, కాళీమాత వేషధారణలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీ దుర్గాదేవీ లేబర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలోల 108 మంది మహిళలు ఎరుపు వస్త్రధారణలో ఊరేగింపుగా దుర్గామాత పూజా మందిరానికి చేరుకున్నారు. అక్కడ నుంచి అసిరిపోలమ్మ తల్లి అమ్మవారి ముర్రాటలు, వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు స్థానిక సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, కారాడ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు దున్న లోకనాథం, దుర్గా దేవి లేబర్ కమిటీ నాయకులు ఇరోతు అప్పన్న, దున్న రాజులు, వి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

– వజ్రపుకొత్తూరు

అమరావతి పేరుతో

ఉత్తరాంధ్రకు అన్యాయం

- వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు ధ్వజం
- నేడు పెద్దిపాలెంలో ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం


మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్. చిత్రంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నవ్యాంధ్రప్రదేశ్‌లో కలిపి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. సొంతంగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను, పొరుగు రాష్ట్రాల పథకాలను ఆయన కాపీ పేస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా పోరాటాలకు సిద్ధమవుతున్నామని వారు స్పష్టం చేశారు. విశాఖ జిల్లా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి నేతలు ఉత్తరాంధ్ర వనరులను కొల్లగొడుతున్నారని, విశాఖలో సదస్సులు నిర్వహించి, పెట్టుబడులను మాత్రం అమరావతికి తరలిస్తున్నారని ఆరోపించారు. అమరావతిపై ఉన్న ప్రేమతో చంద్రబాబు ఉత్తరాంధ్రపై వివక్ష చూపుతూ.. ఈ ప్రాంత అభివృద్ధి విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాట పట్టిన ఉత్తరాంధ్ర.. నేటి కూటమి పాలనలో భ్రష్టుపట్టిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 9న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా మాకవరపాలెం వైద్య కళాశాలను సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలిస్తారని వారు వెల్లడించారు. స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడు అనర్హుడని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం..

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు భీమిలి నియోజకవర్గం పెద్దిపాలెంలోని చెన్నా కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు అమర్‌నాథ్, కేకే రాజు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించి.. భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై చర్చిస్తామన్నారు. మూలపేట పోర్ట్, భోగాపురం ఎయిర్‌పోర్ట్ వంటి ప్రాజెక్టులను ప్రారంభించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, అరకు ఎంపీ జి.తనూజారాణి, మాజీ మంత్రులు, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరవుతారని తెలిపారు.

అద్దె ఇంట్లో అర్ధరాత్రి హైడ్రామా


ఇంట్లో చొరబడిన వారితో కాలనీవాసుల వాగ్వాదం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బ్యాంకర్స్ కాలనీ శివబాలాజీ ఆలయం పరిసర ప్రాంతంలో ఓ ఇంటి వద్ద శుక్రవారం అర్ధరాత్రి హైడ్రామా నడిచింది. ఐదుగురు వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడి హంగామా సృష్టించారు. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తంగుడు ఉపేంద్రకు చెందిన ఇంట్లో జామి విష్ణుమూర్తి కుటుంబంతో సహా అద్దెకు ఉండేవాడు. అద్దె విషయమై ఇద్దరి మధ్య కొన్నాళ్లు వివాదం నడిచింది. ప్రస్తుతం విష్ణుమూర్తి కుమారుడు జామి రమేష్ వద్దే అద్దె ఇంటి తాళాలు ఉన్నాయి. ఈ క్రమంలో రమేష్ తమ ఇంట్లో పని ఉందని, కొంతమంది మనుషులు కావాలంటూ సరుబుజ్జిలికి చెందిన చంటి అనే వ్యక్తిని సంప్రదించాడు. ఆయన కొంత నగదు తీసుకొని ఆమదాలవలసకు చెందిన బుజ్జి, దివ్య, యశోద నవీన్, ధనలక్ష్మీలను పురమాయించి శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో రమేష్ చెప్పిన ఇంటికి పంపించాడు. వీరు రావడాన్ని సీసీ కెమెరాలో గమనించిన యజమాని ఉపేంద్ర.. ఎవరు మీరు.. ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. అయినా వారు వినకుండా గదిలోకి వెళ్లి తలుపు వేసేశారు. దీంతో శ్రీకాకుళం డీఎస్పీకి సమాచారం అందించారు. అదే రోజు రాత్రి రూరల్ ఎస్ఐ సిబ్బందితో వెళ్లి తలుపులు కొట్టినా తీయలేదు.

మరుసటి రోజు శనివారం పోలీసులు, కాలనీవాసులు వెళ్లగా ఎట్టకేలకు తలుపులు తీశారు. అప్పటికే ఆగ్రహంగా స్థానికులు ఇంట్లో బసచేసిన ఐదుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు. వీరు ఎందుకు వచ్చారనే విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు


శ్రీకాకుళం రూరల్: ప్రతి ఆటోడ్రైవర్‌ను ఆదుకుంటామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటోడ్రైవర్లు సేవలో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 13887 మంది ఆటో సోదరులకు రూ.20 కోట్ల 83 లక్షల నగదును అందించామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఆటో, మ్యాక్సీ, క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు అందిస్తామన్నారు. అనంతరం ఎంపీ ఆటో నడిపి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఆర్టీఓ సాయి ప్రత్యూష, డీటీసీ ఎ.విజయసారథి, మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, ఆర్టీవో ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో చోరీ


బుక్‌స్టోర్‌ను పరిశీలిస్తున్న హెచ్‌సీ రూప్‌కుమార్

కంచిలి: మకరాంపురం గ్రామ సచివాలయం సమీపంలో మూడు దుకాణాల్లో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. మీనాక్షి జిరాక్స్, బుక్ స్టోర్‌లో రూ.3వేలు నగదు, శ్రీ భూలోక మాత ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ షాప్‌లో సుమారు రూ.10వేలు నగదు, టార్చిలైట్లను పట్టుకుపోయారు. కూరగాయలు షాపు తాళాలు పగులగొట్టినా ఎటువంటి చోరీ జరగలేదు. బాధితులు కంచిలి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో హెచ్‌సీ జె.రూప్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్


చికిత్స పొందుతున్న లక్ష్మణరావు

హిరమండలం: గొట్టా బ్యారేజీ వద్ద కొరసవాడ గ్రామానికి చెందిన ఏడురి లక్ష్మణరావు ద్విచక్ర వాహనంతో వెళ్తూ అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. శనివారం సుభలయ నుంచి స్వగ్రామం కొరసవాడకు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు స్పందించి బాధితుడిని ఆటోలో హిరమండలం పీహెచ్‌సీ తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

మెడికల్ మాఫియాను అడ్డుకోవాలి


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కేంద్రం మెడికల్ మాఫియాకు నిలయంగా మారిందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో చాలా ఆస్పత్రుల్లో టెస్టులు, స్కానింగ్ పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు నోటీసు బోర్డులు ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా వైద్యారోగ్య శాఖ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. పలుచోట్ల అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, వాటిని సీజ్ చేయని పక్షంలో పోరాటం తప్పదన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు రవి, ఎ.వసంతరావు, ముచ్చ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరికి ఉపకారిగా..


పీహెచ్‌సీకి సామగ్రి అందిస్తున్న కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, కుటుంబ సభ్యులు


- స్వగ్రామం పురుషోత్తపురం అభివృద్ధికి కృషి చేస్తున్న కేవీజీ
- ఇప్పటికే పీహెచ్‌సీకి భూదానం
- తాజాగా రూ.2లక్షలతో వైద్యారోగ్య పరికరాల వితరణ

సరుబుజ్జిలి : పుట్టిన ఊరు రుణం తీర్చుకునేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని, పురుషోత్తపురం పంచాయతీ, పీహెచ్‌సీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం జిల్లా పార్లమెంటరీ పరిశీలకుడు కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ అన్నారు. తన సోదరుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిల్లి విశ్వేశ్వరరావు జ్ఞాపకార్థం నిర్మించిన 'కిల్లి వెంకట అప్పలనాయుడు పీహెచ్‌సీ'కి కుటుంబ సభ్యులు సమకూర్చిన రూ.2లక్షల విలువైన వైద్యారోగ్య మెటీరియల్‌ను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి రమాదేవి, సర్పంచ్ కిల్లి రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ పైడి నర్సింహ అప్పారావు, పార్టీ నేతలు కిల్లి రామ్మోహనరావు, కిల్లి వెంకటేష్, కిల్లి వెంకటరమణ, ఆస్పత్రి వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవలకు కేరాఫ్ అడ్రస్...

గత వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో తన తండ్రి కిల్లి వెంకట అప్పలనాయుడు పేరిట మంజూరైన పీహెచ్‌సీని రూ.2కోట్ల 30 లక్షలతో నిర్మించారు. దీనికోసం రూ.కోటీ 50 లక్షల విలువైన 2 ఎకరాల సొంత స్థలాన్ని దానం చేశారు. ఆస్పత్రి ఆవరణలో రూ.5లక్షల సొంత నిధులతో వాటర్‌ప్లాంట్ నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేశారు. తాజాగా వైద్య పరికరాలు, ఇతర సామగ్రి అందజేశారు.

ప్రాణదాత జగన్..



పురుషోత్తపురం గ్రామానికి అడిగిన వెంటనే పీహెచ్‌సీ మంజూరు చేసిన గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు ప్రాణదాతగా నిలిచారు. ప్రజా సంక్షేమం కోసం పార్టీ తరపున అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.

– కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పురుషోత్తపురం

ఆటో బోల్తా-పలువురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన శోభావతి

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రి సమీపంలో శనివారం సాయంత్రం పంది అడ్డురావడంతో దానిని తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస మండలం కోసంగిపురం గ్రామానికి చెందిన యవ్వారు దుర్యోధనరావు తన భార్య గంగాభవానీ, ఇద్దరు పిల్లలు, అత్తయ్య పినకాన రాములమ్మతో కలిసి ఆటోలో శనివారం టెక్కలి మండలం వీఆర్‌కేపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వలేసాగరం వద్ద నందిగాం మండలం సవర రామకృష్ణపురం గ్రామానికి చెందిన నందిగాం శోభావతిని అదే ఆటోలో ఎక్కించుకుని టెక్కలి వైపు వస్తుండగా జిల్లా ఆస్పత్రి సమీపంలో పంది అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఒక్కసారిగా ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలు కావడంతో వెంటనే సమీపంలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. శోభావతి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. మిగిలిన వారికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

టోకెన్లు సరే..ఎరువులేవీ?

ఆమదాలవలస రూరల్: ఎరువుల కష్టాలు రైతులను వెంటాడుతున్నాయి. ఆమదాలవలస మండల కేంద్రం నుంచి ఒక్కోరైతుకు రెండు, మూడు బస్తాల యూరియా అందించేందుకు ఇటీవల వ్యవసాయ, రెవెన్యూ, రైతు సేవా కేంద్రాల అధికారులు సంతకం చేసి టోకెన్లు అందించారు. వీటిని పట్టుకొని ఎరువుల సరఫరా కేంద్రం వద్ద క్యూ కట్టినా అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆమదాలవలస మండలం ఇసుకలపేట గ్రామానికి చెందిన అన్నెపు నీలారావుకు టోకెన్ అందించినా ఇంతవరకు ఎరువు అందలేదు. ఇలాంటి రైతులు ఎంతోమంది ఉన్నారు.